జూబ్లీహిల్స్‌ ఉపఎన్నికలో ప్రజాదరణ బీఆర్‌ఎస్‌కే...



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌

ముషీరాబాద్‌: జూబ్లీహిల్స్‌ ఉపఎన్నికలో ప్రజాదరణ బీఆర్‌ఎస్‌కే ఉందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ పేర్కొన్నారు. బుధవారం భోలక్‌పూర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ నాయకులు బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సునీతకు మద్దతుగా బీఆర్‌ఎస్‌ యువ నాయకుడు ముఠా జైసింహా ఆధ్వర్యంలో ప్రచారానికి వెళ్లి కొప్పుల ఈశ్వర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కొప్పుల ఈశ్వర్‌ మాట్లాడుతూ... జూబ్లీహిల్స్‌లో అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు వై.శ్రీనివాస్‌రావు, బింగి నవీన్‌, ఉమాకాంత్‌, శంకర్‌గౌడ్‌, ప్రవీణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అంధుల సమస్యలు పరిష్కరించాలి

సుల్తాన్‌బజార్‌: పదవీ విరమణ చేసిన అంధుల ఉద్యోగులకు రిటైర్‌మెంట్‌ బెనిఫిట్స్‌ చెల్లించాలని తెలంగాణ అంధుల అభివృద్ధి సంక్షేమ సంఘం నేతలు అన్నారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పి.బొక్కారావు, అధ్యక్షుడు జి.అంజయ్య గౌడ్‌ మాట్లాడుతూ ప్రభుత్వం అంధుల కోసం హాస్టళ్లను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తున్నట్లు సమాచారం అందుతుందని, దానిని వెంటనే విరమించుకోవాలని కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్‌ స్వాతంత్ర సమరయోధుల సంఘం నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలకు రూ.50 లక్షలు మంజూరు చేసిందని అదే తరహాలో అంధుల అభ్యున్నతి కోసం పనిచేస్తున్న అంధుల పాఠశాలలు, సంస్థలు, వికలాంగుల కోసం పనిచేస్తున్న ఎన్జీఓలకు గ్రాంట్లు ఇవ్వాలని కోరారు. అంధుల సమాజ సాధికారత కోసం పనిచేస్తున్న సంఘాలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అంధులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత పాసులు ఇవ్వాలని వికలాంగులకు సంక్షేమం కోసం కేటాయించిన 5 శాతంలో 1 శాతం అంధులకు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి ఎన్‌.పరమేష్‌, సభ్యులు అజిత్‌ కుమార్‌, అంజయ్య, నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో 'క్లీన్‌ అండ్‌ గ్రీన్‌'



శ్మశానవాటికలో వ్యర్థాల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు, నాయకులు

ముషీరాబాద్‌: దీపావళి పండుగను పురస్కరించుకుని అడిక్‌మెట్‌ డివిజన్‌లోని అంజయ్యనగర్‌, వడ్డెర బస్తీ, అంబర్‌నగర్‌ శ్మశానవాటికల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ముషీరాబాద్‌ సర్కిల్‌ అధికారులు బుధవారం తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సన్నీ, ఏఈ విశ్వేష్‌, బీజేపీ అడిక్‌మెట్‌ అధ్యక్షులు పాశం సాయికృష్ణయాదవ్‌ పాల్గొని పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఈ సన్నీ మాట్లాడుతూ... దీపావళి పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా శ్మశానవాటికల్లో 'క్లీన్‌ అండ్‌ గ్రీన్‌'కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. పాశం సాయికృష్ణయాదవ్‌ మాట్లాడుతూ... డివిజన్‌లోని అన్ని శ్మశానవాటికల్లో ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. అదే విధంగా శ్మశానవాటికల్లో విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. డివిజన్‌లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పూడ్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వి.కిషోర్‌, అరవింద్‌, రాజు, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



ముషీరాబాద్‌: హోంశాఖ స్పెషల్‌ చీఫ్‌ సెక్రటరీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్‌ను నియోజకవర్గానికి చెందిన పీపుల్‌ అండ్‌ పీస్‌ కమిటీ చైర్మన్‌ ముఖ్తార్‌ హుస్సేన్‌ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అడ్వైజర్‌ ఎంఏ సిద్దిఖ్‌, ప్రిన్స్‌ దస్తగిరి, సయ్యద్‌ ఇర్షాద్‌ పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌కు అడ్డేది?

- కాచిగూడలో అంతర్గత రోడ్లపై పార్కింగ్‌
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని ట్రాఫిక్‌ అధికారులు



బర్కత్‌పుర రెడ్డి ఉమెన్స్‌ కాలేజీ పక్క వీధిలో రోడ్డుకిరువైపులా వాహనాల పార్కింగ్‌

కాచిగూడ: అసలే ఇరుకురోడ్లు.. ఆపై వాహనాల అక్రమణతో మరింత ఇరుకుగా మారి నడిచేందుకు దారిలేకుండా పోయింది. కాచిగూడ, గోల్నాక డివిజన్ల లోని పలు బస్తీలు, కాలనీల్లో అంతర్గత రోడ్లపై అక్రమ పార్కింగ్‌ కారణంగా ఆయా ప్రాంతవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా బర్కత్‌పుర, నారాయణగూడ, లింగంపల్లి, కుద్బిగూడ, సుందర్‌నగర్‌, కృష్ణానగర్‌, నెహ్రూనగర్‌, నింబోలిఅడ్డ, చెప్పల్‌బజార్‌, బర్కత్‌పుర బస్‌ డిపో రోడ్డు, తదితర ప్రాంతాల్లో నిత్యం రోడ్లపై వాహనాలు పార్కింగ్‌ చేసి ఉండడంతో పాటు భవన నిర్మాణ సామగ్రిని, వ్యర్థాలను రోడ్లపైనే నిల్వ చేస్తున్నారు. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణానికి తీవ్ర అసౌకర్యం ఏర్పడుతోంది.

రోడ్డుకిరువైపుల పార్కింగ్‌

కుద్బిగూడ రోడ్డులో రోడ్డుకు ఇరువైపుల వాహనాలను అక్రమంగా అడ్డగోలు పార్కింగ్‌ చేస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో అక్కడ ట్రాఫిక్‌ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. మున్నూరుకాపు భవన్‌ మ్యాడం అంజయ్య హాల్‌ వెనుకవైపు వాహనాలను నెలల తరబడి వివిధ ప్రాంతాలకు చెందిన వారు తమ వాహనాలను రోడ్డుకిరువైపుల పార్కింగ్‌ చేస్తున్నారు. అదే విధంగా రెడ్డి మహిళా కళాశాల రోడ్డు, కాచిగూడ స్టేషన్‌ పరిసరాల్లో వాహనాలను ఇలానే పార్కింగ్‌ చేస్తున్నారు.

పార్కింగ్‌ చేసి వెళ్లిపోతున్నారు..

కుద్బిగూడ రోడ్డులో వాహనాల రద్దీ గణనీయంగా పెరిగింది. వాహనాలను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తమ వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కింగ్‌ చేస్తూ వెళ్ళిపోతున్నారు. అడ్డదిడ్డమైన పార్కింగ్‌తో స్థానికులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. కాచిగూడ మెయిన్‌ రోడ్డుపై షాపుల ముందు, హోటళ్ల ముందు వాహనాలను పార్కింగ్‌ చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. అక్రమంగా పార్కింగ్‌ చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ట్రాఫిక్‌ నియంత్రణకు సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

షరా మామూలే..!

జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్‌ పోలీసులు సమన్వయంతో వ్యవహరించి రోడ్లపై అక్రమ పార్కింగ్‌ను నిరోధించాలని స్థానికులు కోరుతున్నారు. ఫిర్యాదులు అందిన సమయంలో అధికారులు ఏదో హడావిడి చేస్తున్నారు. రోడ్లపై పార్కింగ్‌ చేసే వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని జీహెచ్‌ఎంసీ, పోలీస్‌ అధికారులను కోరుతున్నారు.



కుద్బిగూడ మున్నూరుకాపు భవన్‌ వెనుక రోడ్డులో ఇలా..



విక్రమ్‌నగర్‌ పార్క్‌ వద్ద ఇదీ పరిస్థితి

మేమెంతో మాకంత వాటా కావాలి

- సేవాలాల్‌ సేనా జాతీయ అధ్యక్షుడు సంజీవనాయక్‌
- తెలంగాణ బంద్‌కు సంపూర్ణ మద్దతు



సేవాలాల్‌ సేన సమావేశంలో మాట్లాడుతున్న భూక్య సంజీవనాయక్‌

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ ఈనెల 18న బీసీలు తలపెట్టిన బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు సేవాలాల్‌ సేనా జాతీయ అధ్యక్షులు సంజీవ నాయక్‌ స్పష్టం చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్‌ సేన ఆధ్వర్యంలో రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజీవ నాయక్‌ మాట్లాడుతూ... మేమెంతో మాకంత వాటా కావాలని డిమాండ్‌ చేశారు. ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్‌ ఇవ్వడానికి ఎలాంటి అడ్డంకులు లేని కేంద్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్‌ ఇవ్వడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఏ రాష్ట్రం అనుమతి లేకుండానే 143 రాజ్యాంగ సవరణ చేసి ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్‌ అమలు చేశారని విమర్శించారు. 15 శాతం ఉన్న అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్‌ అమలు చేయడానికి జీఓ నం .9ను తీసుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వ బీసీలను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ఇలాంటి సమస్యలు వస్తాయని ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. బీసీలో ఐక్యత లోపించడం వలనే ప్రభుత్వం వివక్షత చూపుతుందన్నారు. బీసీల బంద్‌కు సకల జనుల మద్దతు లభిస్తుందన్నారు. ఈ బీసీల ఉద్యమం దేశ వ్యాప్తంగా నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఎరుకల సంఘం అధ్యక్షులు కోనేటి నరిసింహా, ఎస్సీ, ఎస్టీ మాజీ కమిషన్‌ సభ్యులు, ఎల్‌హెచ్‌పీఎస్‌ అధ్యక్షులు రాంపాల్‌ నాయక్‌, ప్రొఫెసర్‌ అశోక్‌, సేవాలాల్‌ సేన రాష్ట్ర అధ్యక్షులు బానోతు హుస్సేన్‌నాయక్‌, ఓయూ జేఏసీ నాయకులు డాక్టర్‌ నెహ్రూ నాయక్‌, శరత్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలి

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

కాచిగూడ: స్థానిక సంస్థల్లో ప్రభుత్వం కల్పించిన 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా ఈనెల 18వ తేదీన విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తెలిపారు. స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు అన్ని స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని బీసీలకు మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు. పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లలను పాఠశాలలు, కళాశాలలకు పంపొద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు బంద్‌కు మద్దతు తెలియజేశాయని తెలిపారు. ఆర్టీసీ కార్మిక సంఘాలు, ఆటో డ్రైవర్స్‌ యూనియన్లు బీసీలకు మద్దతుగా బంద్‌లో పాల్గొంటామని ప్రకటించారని ఆయన తెలిపారు. బంద్‌ను పూర్తిస్థాయిలో విజయవంతం చేసి బీసీలకు న్యాయం జరిగే విధంగా చూడాలి కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ ఆవిర్భావం



బీసీ నేతలతో కలిసి జేఏసీని ప్రకటిస్తున్న దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: జాతీయ బీసీ దళ్‌ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి నేతృత్వంలో బుధవారం కాచిగూడలో జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో 'బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ'ఆవిర్భావం జరిగింది. జేఏసీ చైర్మన్‌గా దుండ్ర కుమారస్వామిని సమావేశంలో పాల్గొన్న యువజన నేతలు, కుల సంఘాల రతినిధులు, న్యాయవాదులు, ఆటో డ్రైవర్లు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, బీసీ ఉద్యోగుల, మహిళా సంఘాల ప్రతినిధులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కుమారస్వామి మాట్లాడుతూ.. ఈనెల 18న జరిగే తెలంగాణ బంద్‌కు తమ జేఏసీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందన్నారు. 16న జేఏసీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పూర్తి స్థాయిలో పనిచేయడానికి రాష్ట్ర స్థాయి జేఏసీ కమిటీని ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు రూబీన్‌ గౌడ్‌, శివాజీ, రాజేష్‌, శ్రీనివాస్‌, కృష్ణ, మహేష్‌, వెంకటేష్‌, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌కు సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ సంపూర్ణ మద్దతు

ముషీరాబాద్‌: రాష్ట్రంలో బీసీ వర్గాలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌ బిల్లును గవర్నర్‌, రాష్ట్రపతి ఆమోదించని వైఖరిని నిరసిస్తూ... జీఓ నం. 9 ఆర్డినెన్సుపై హైకోర్టు స్టే విధించడాన్ని వ్యతిరేకిస్తూ బీసీ సంఘాలు ఐక్యంగా అక్టోబర్‌ 18న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రం బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని సీపీఐ(ఎంఎల్‌) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా జరిగే వివిధ ఆందోళనలలో పాల్గొంటామని అన్నారు. 42 శాతం రాజకీయ రిజర్వేషన్‌ కోసం బీసీ వర్గాలు ఐక్యంగా చేస్తున్న కార్యక్రమాలను సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌(ప్రజాపంథా) క్రియాశీలంగా బలపరుస్తుందని తెలిపారు.

బీసీలకు ఆర్థిక, రాజకీయరంగాల్లో ప్రాధాన్యం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మెరుగు శ్రీనివాస్‌యాదవ్‌

చిక్కడపల్లి: బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచిత ప్రాధాన్యం కల్పించాలని టీజేఎస్‌ నియోజకవర్గ కన్వీనర్‌ మెరుగు శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన తలపెట్టిన బంద్‌ను టీజేఎస్‌ పూర్తి మద్దతు ఇస్తోందని తెలిపారు. బుధవారం డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల చట్టం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్‌ గాంధీనగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు జి.రవీందర్‌, నేతలు సత్యనారాయణ, వెంకటేశ్‌, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంట పీఎస్‌లో ఓపెన్‌ హౌజ్‌



పోలీసు విధులు, ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌హెచ్‌వో మారుతీప్రసాద్‌

నల్లకుంట: విధి నిర్వహణలో తీవ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల సంస్మరణార్థం ఓపెన్‌ హౌజ్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని నల్లకుంట ఎస్‌హెచ్‌వో మారుతీప్రసాద్‌ చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు ఓపెన్‌ హౌజ్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు విధులు, వారు వినియోగించే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు, బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకోవడం, కేసుల నమోదు, నేర దర్యాప్తు విధానం తదితర విషయాలను విద్యార్థులకు తెలియజేయడానికి ఓపెన్‌ హౌజ్‌ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

- బాంబు డిస్పోజబుల్‌ టీం, ఫింగర్‌ ప్రింట్‌, పోలీసు కంట్రోల్‌ రూమ్‌, కమ్యూనికేషన్స్‌, ఆయుధాల విడి భాగాలు (ఏకే 47, విల్‌ పిస్టల్‌, గ్లో 17, కార్బన్‌, ఇన్సాస్‌ రైఫిల్‌, గ్యాస్‌ గన్‌, గ్రేనేడ్‌, ఫోరెన్సిక్‌, ఆర్‌ఎఫ్‌ఎస్‌ఎల్‌) తదితర విషయాల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై ఆప్యాయంగా మాట్లాడారు. అలాగే ఏదైన నేరం జరిగినప్పుడు ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం, జీడీ ఎంట్రీ, ఎఫ్‌ఆర్‌ఐ నమోదు, సైబర్‌ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఐ రాములు, అడ్మిన్‌ ఎస్సై వరలక్ష్మి, ఎస్సైలు శ్రీనివాస్‌రావు, లక్ష్మీనారాయణ, హరీష్‌తో పాటు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

21న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీస్వామి రాక

నల్లకుంట: శ్రీ దక్షిణామ్నాయ శారదాపీఠం శృంగేరి పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతీస్వామి విజయ యాత్ర–2025లో భాగంగా ఈనెల 21న నల్లకుంట శంకరమఠానికి విచ్చేస్తున్నారని ధర్మాధికారి శ్రీనివాసమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 21 నుంచి 28వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విధుశేఖర భారతీస్వామి దర్శనం ఉంటుందన్నారు. అలాగే రాత్రి 8.30గంటలకు చంద్రమౌళీశ్వర అభిషేకం ఉంటుందని చెప్పారు. 23న శాస్త్ర సభ, 2న కుంబాభిషేకం ఉంటుందని తెలిపారు. 27వ తేదీన కార్తీక సోమవారం పురస్కరించుకొని మధ్యాహ్నం 12గంటలకు చంద్రమౌళీశ్వర అభిషేకం ఉంటుందని వివరించారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో విధుశేఖర భారతీస్వామిని దర్శించుకుని, ఆశీర్వాదాలు అందుకోవాలని కోరారు.

కరెంట్‌ స్తంభానికి మంటలు



చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని స్ట్రీట్‌ నం.10లోని అరోరా కళాశాల లేన్‌లో బుధవారం రాత్రి విద్యుత్‌ స్తంభానిక షార్ట్‌ సర్క్యూట్‌ కావడంతో మంటలు అంటుకున్నాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ముషీరాబాద్‌ ఫైర్‌ ఆఫీసర్‌ చాణిక్య వెంటనే స్పందించి అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేయించారు.

- ఈ విషయం తెలుసుకున్న నారాయణగూడ ఎలక్ట్రిసిటీ ఇన్‌చార్జి, ఏఈ విశ్వనాథ్‌ విషయం తెలుసుకుని విద్యుత్‌ సరఫరాను నిలిపివేశారు. ఇంటర్‌నెట్‌ కేబుల్‌లో డీసీ విద్యుత్‌ సరఫరా జరగడంతో షార్ట్‌ సర్క్యూట్‌ అయ్యిందని అధికారులు తెలిపారు. మంటలార్పిన అనంతరం విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించారు. స్థానికులు ఫిర్యాదుతో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్‌ రాజునాయక్‌, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎవరికీ ఎలాంటి అపాయం జరగకపోవడంతో పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు



వివేక్‌నగర్‌ పీపుల్స్‌పార్క్‌లో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్‌ పావని

చిక్కడపల్లి: గాంధీనగర్‌ డివిజన్‌లో పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని డివిజన్‌ కార్పొరేటర్‌ పావని అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని వివేక్‌నగర్‌ పీపుల్స్‌పార్క్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ... పార్క్‌ చుట్టూ కాంపౌండ్‌ వాల్‌, పెయింటింగ్‌, వీధి దీపాల ఏర్పాట్లు చేశామన్నారు. పార్క్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్‌, పి.నర్సింగ్‌రావు, ప్రశాంత్‌, పార్క్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు ప్రేమ్‌కుమార్‌, గణేష్‌, ఆంజనేయులు, జితేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

రైలులో బంగారు ఆభరణాల బ్యాగు చోరీ

కాచిగూడ: రైలులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి బంగారు ఆభరణాల చేతి బ్యాగు చోరికి గురైన సంఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్‌ ఆర్‌.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌ కడప ప్రాంతానికి చెందిన మూర్తి తన భార్య లక్ష్మీతో కలిసి కడప నుంచి కాచిగూడ కు రైలులో వస్తున్నారు. రైలు వనపర్తి రైల్వే స్టేషన్‌ వద్దకు రాగానే చూసుకోగా చేతి బ్యాగు కనిపించలేదు. బ్యాగులో 30 గ్రాముల బంగారు గొలుసు, బ్రాస్‌లెట్‌, చెవి కమ్మలు, రెండు ఉంగరాలు రూ. 30వేల నగదు, సెల్‌ఫోన్‌ ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కేసును మహబూబ్‌నగర్‌ రైల్వే పోలీస్‌ స్టేషన్‌కు బదిలీ చేశారు.

బాల్యం బాగుంటేనే భవిష్యత్‌ బంగారుమయం

నాంపల్లి సీడీపీఓ కృష్ణచైతన్య

కువాడిగూడ: బాల్యం బాగుంటేనే భవిష్యత్‌ బంగారుమయంగా ఉంటుందని నాంపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కృష్ణ చైతన్య అన్నారు. బుధవారం బండమైసమ్మనగర్‌ కమ్యూనిటీహాల్‌ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సరైన పోషకాలు అందక చిన్నారుల్లో ఎదుగుదల లోపిస్తుందని అన్నారు. అలాంటి వారిని గుర్తించి అంగన్‌వాడీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆమె సూచించారు. తల్లీబిడ్డలకు పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. పిల్లల పోషణ ఆరోగ్యం మెరుగుపర్చడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ బాల, టీచర్లు, స్వప్న, శారద, సంతోషిని, ధనమ్మ, కవిత, ఆయాలు భువేశ్వరి, మీనాక్షి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బండమైసమ్మనగర్‌ అంగన్‌వాడీలో జరిగిన పోషణ మాసోత్సవంలో సీడీపీఓ కృష్ణచైతన్య, టీచర్లు

సంక్షేమ బోర్డులో జీఓ.12ను సవరించడం సరికాదు

- కార్మికుల సంక్షేమాన్ని ప్రైవేట్‌ ఇన్సురెన్స్‌ కంపెనీలకు అప్పగించొద్దు
- ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వర్‌రావు



కార్మికశాఖ కమిషనర్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



కార్మికశాఖ రాష్ట్ర డీసీకి వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్వర్‌రావు తదితరులు

చిక్కడపల్లి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని ప్రైవేట్‌ ఇన్సురెన్స్‌ కంపెనీలకు అప్పగించడాన్ని వెంటనే విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్‌ కార్యాలయం ఎదుట ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంక్షేమ బోర్డులో జీఓ నం.12ను సవరించడం సరికాదన్నారు. ప్రభుత్వమే స్కీముల బాధ్యత తీసుకోవాలని కోరారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ మాట్లాడుతూ... భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లించొద్దని కోరారు. బీటీసీ అడ్డాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్మికుల పెండిగ్‌ దరఖాస్తులలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. 50 సంవత్సరాల వయస్సు దాటిన వారికి రూ.10వేల పింఛన్‌ను మంజూరు చేయాలన్నారు. అనంతరం కార్మికశాఖ ఉపకమిషనర్‌ ప్రమోద్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ నేతలు శ్రీనివాస్‌, నాగయ్య, జి.పటేల్‌, మోహన్‌, మధు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.